

ఆదివాసీల పోరుబాట

రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆందోళనబాట పట్టేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. 8లో▸



పక్షులు మెరిసే.. బర్డ్‌వాచర్లు మురిసే

జన్నారం రేంజ్‌లోని బైసన్‌కుంట, మల్యాల వాచ్‌టవర్ ప్రాంతాల్లో పక్షి ప్రేమికులు పర్యటించారు. వివిధ రకాల పక్షులను గుర్తించారు. వెంటనే తమ కెమెరాల్లో బంధించారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.3 /17.4

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్ దంపతుల ఆటవిడుపు



బ్యాడ్మింటన్ ఆడుతున్న కలెక్టర్ దంపతులు

మంచిర్యాలటౌన్: జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తన భార్యతో కలిసి ఆదివారం ఆటవిడుపుగా బ్యాడ్మింటన్ ఆడారు. సెలవు రోజు కావడంతో భార్యతో కలిసి రంగంపేటలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి వెళ్లిన కలెక్టర్ కొంతసేపు బ్యాడ్మింటన్‌ను ఆడారు. కలెక్టర్ దంపతులకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుల్లూరి సుధాకర్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, కమిటీ బాధ్యులు మధుకృష్ణ, కోచ్ నాగేంద్ర స్వాగతం పలికారు.

ఐక్యంగా అభివృద్ధి చెందాలి



ట్యాంకును ప్రారంభిస్తున్న శర్మన్‌నాయక్

జన్నారం: లంబాడాలు ఐక్యంగా అభివృద్ధి చెందాలని రిటైర్డ్ కలెక్టర్ శర్మన్‌నాయక్ అన్నారు. మండలంలోని జువ్విగూడలోని సేవాలాల్ ఆలయం సమీపంలో శర్మన్‌నాయక్ తండ్రి రాములు నాయక్ జ్ఞాపకార్థం రూ.50 వేలతో నిర్మించిన నీటి ట్యాంకును ఆదివారం ప్రారంభించారు. అనంతరం సేవాలాల్ పూజలు చేశారు. జగదాంబ ఆలయానికి సొంత భవనం, ప్రహరీ నిర్మాణం, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వంద మంది యువకులకు టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. ట్యాంకు కోసం రవీందర్ అనే ఉపాధ్యాయుడు రూ.10 వేలతో విద్యుత్ మోటార్ ఏర్పాటు చేశాడు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సందేశ్, చందులాల్, రాజునాయక్, ప్రకాశ్‌నాయక్, రవీందర్, సక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 7,99 మంది విద్యార్థులకు 745 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 651 మందికి 604 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో శైలజ పరిశీలించారు.

బాడీబిల్డింగ్‌లో ప్రతిభ



వెంకటేశ్‌ను అభినందిస్తున్న జిమ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: వరంగల్‌లో ఇటీవల నిర్వహించిన కేసీఆర్ కప్ తెలంగాణ బాడీ బిల్డింగ్ పోటీల్లో మంచిర్యాలకు చెందిన మాసు వెంకటేశ్ ప్రథమ స్థానం సాధించాడు. 55 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలవడంతో చాంపియన్ జిమ్ నిర్వాహకులు కొయ్యడ విద్యాసాగర్‌గౌడ్, జిమ్ సభ్యుడు నాగుల శ్రీనివాస్ అభినందించారు.

మహిళల రక్షణకు సైకిల్ యాత్ర

- యువతిని అభినందించిన డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్



ఆశా మాల్వియాను అభినందిస్తున్న డీసీపీ

మంచిర్యాలక్రైం: ఉమెన్ సేఫ్టీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశా మాల్వియా మహిళల రక్షణపై అవగాహన కల్పించేందుకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర ఆదివారం మంచిర్యాలకు చేరుకుంది. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆశా మాల్వియాను అభినందించారు. యాత్రీకురాలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 25 వేల కిలో మీటర్లు ప్రయాణించాలనే లక్ష్యంతో యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. 2022, నవంబర్ 1న మధ్యప్రదేశ్‌లోని రహోపాల్ నుంచి మొదలు పెట్టిన యాత్ర గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మీదుగా తెలంగాణలోకి చేరుకున్నట్లు వివరించారు. ఈ యాత్రలో మహిళల రక్షణ, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్లు ఆశా మాల్వియా తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజు, ఎస్సై పాల్గొన్నారు.

‘గట్టు’కు పోటెత్తారు



గర్భగుడిలో పూజ చేస్తున్న అర్చకుడు



మల్లికార్జునస్వామి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

- వేలాల మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తజనం
- పట్నాలు వేసి.. బోనాలు పోసి మొక్కులు సమర్పించిన భక్తులు
- శివసత్తుల పూనకాలు.. లక్ష్మీదేవరుల ప్రదర్శనలతో మార్మోగిన జాతర
- 3 లక్షలకుపైగా భక్తులు వచ్చినట్లు అధికారుల అంచనా

జైపూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వేలాల మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం వచ్చిన భక్తులంతా గోదావరిలో పుణ్యస్నానాలు చేసి గుట్టపై దొణలో స్వయంభూగా వెలిసిన మల్లన్నను దర్శించుకున్నారు. బోనం పోసి స్వామికి నైవేద్యం సమర్పించారు. రాత్రంతా జాగరణ చేశారు. శివనామస్మరణతో వేలాల మార్మోగింది. వేడుకల్లో భాగంగా రెండో రోజు ఆదివారం గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి పట్నాలు వేసి, బోనాలు పోసి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజు వేలాలలో భక్తజన జాతర సాగింది. శివసత్తుల పూనకాలు.. లయబద్ధమైన నృత్యాలు.. లక్ష్మీదేవరుల ప్రదర్శనలు.. ఒగ్గు పూజారుల జగ్గు వాయిద్యాలతో వేలాల పులకించింది. రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

స్వామివారికి సీపీ పూజలు..

వేకువజాము నుంచే మల్లికార్జున స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. రద్దీ చాలా ఎక్కువగా ఉండడంతో స్వామివారి దర్శనానికి గంటలతరబడి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఒగ్గు పూజారులతో పట్నం వేయించి, స్వామివారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్, జైపూర్ ఏసీపీ నరేందర్ దొణలో స్వయంభూగా వెలిసిన గట్టు మల్లన్న స్వామిని, గుట్ట కింద మల్లికార్జున స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం డ్రోన్ కెమెరాలతో జాతరలో భద్రత చర్యలను సీపీ పర్యవేక్షించారు.



బోనాన్ని పూజిస్తున్న భక్తురాలు

మల్లన్నకు పట్నాలు

శ్రీమల్లికార్జునస్వామి(మల్లన్న) దేవుడు అంటే గుర్తుకు వచ్చేది పట్నాలు. సుదూరప్రాంతాల నుంచి జాతరకు తరలి వచ్చిన భక్తులు పసుపు, కుంకుమ, పచ్చ ముగ్గు, కుడుక, రైకబట్ట, శూలం గజ్జల లాగులతో పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. కోరిన కోర్కెలు తీర్చే మల్లన్న స్వామికి భక్తులు కుటుంబ సమేతంగా ఒగ్గు పూజారులతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

తెల్లవార్లు జాతర హోరు..

వేలాల శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజున నిర్వహించిన జాతర తెల్లవార్లూ భక్తజనంతో హోరెత్తింది. జాతరకు తరలివచ్చిన భక్తులతోపాటు సమీప ప్రాంతాల వారు రాత్రివేళ జాతరను తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో వేలాల గ్రామం కిక్కిరిసిపోయింది. వేలాల ముఖద్వారం నుంచి గోదావరి రోడ్డు వరకు ఏర్పాటు చేసిన దుకాణాలు రాత్రంతా భక్తుల షాపింగ్‌తో రద్దీగా కనిపించాయి.







పూజలు చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ కేకన్ సుధీర్, ఏసీపీ నరేందర్, మల్లన్న స్వామి పట్నాలు వేస్తున్న భక్తులు, మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, పూనకాలతో ఊగిపోతున్న మల్లన్న భక్తులు ఒగ్గు పూజారికి కట్నం ఇస్తున్న భక్తురాలు

బుగ్గలో శివపార్వతుల కల్యాణం



మాంగల్యధారణ చేస్తున్న వేద పండితుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బుగ్గ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలను సంప్రదాయ బద్ధంగా మేళతాళాలతో మండపానికి తీసుకువచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిపించారు. ఈ రమణీయ ఘట్టాన్ని తిలకించిన భక్తులు తన్మయం చెందారు. శివ నామస్మరణతో బుగ్గ ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. ఆలయ కమిటీ అధ్యక్షురాలు మాసాడి శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు. మరోవైపు వేలాదిగా తరలివచ్చిన భక్తులు రాత్రంతా ఆలయ ప్రాంగణంలో జాగరణ చేశారు.

నువ్వులేని జీవితం నాకొద్దు

- క్షణికావేశంలో క్రిమిసంహారక మందు తాగిన ప్రేమ జంట
- తర్వాత బతకాలని స్వయంగా ఆస్పత్రికి..
- చికిత్స పొందుతూ రెండు గంటల వ్యవధిలో ఇద్దరూ మృతి



శ్రీకాంత్(ఫైల్)



సంఘవి(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇద్దరిదీ ఒకే ఊరు.. ఒకే వీధి.. 8 నుంచి స్నేహితులు... వయసుతోపాటు వారి స్నేహం ప్రేమగా మారింది. ఈ ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లాలనుకున్నారు. పెద్దలను ఒప్పించి ఏడడుగులు వేయాలని నిర్ణయించుకున్నారు. అయితే క్షణికావేశంలో ప్రియుడు తీసుకున్న ఓ నిర్ణయం వారి జీవితానికి ముగింపు పలికింది. రెండు గంటల వ్యవధిలో ఇద్దరూ మృతిచెందారు. హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన నాగవెల్లి శ్రీకాంత్(25), నరెడ్ల సంఘవి(21) ఎనిమిదేళ్లుగా స్నేహితులు, ఇద్దరి ఇళ్లు సమీపంలోనే ఉండడంతో మిత్రులుగా ఉన్నారు. ఆ స్నేహం క్రమంగా ప్రేమగా మారింది. శ్రీకాంత్ సొంత ఆటో నడుపుతూ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేవాడు. సంఘవి గతేడాది డిగ్రీ పూర్తిచేసింది. దీంతో పెళ్లిచేసుకుని కలకాలం కలిసి జీవించాలనుకున్నారు. ఈమేరకు పెద్దలను ఒప్పించి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తమ ప్రేమ విషయం ఇరువురి కుటుంబాల్లో చెప్పారు. పెద్దలు కూడా వారి ప్రేమను అంగీకరించారు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ, ఈ నెల 17, సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శ్రీకాంత్ తన ఆటోలో సంఘవిని తీసుకుని హాజీపూర్ మండలం గుడిపేట గోదావరి శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ప్రాంతంవైపు వెళ్లాడు. అక్కడ చాలాసేపు మాట్లాడుకున్నారు. శ్రీకాంత్ తనకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయని, ఇప్పుడు పెళ్లి చేసుకోలేనని సంఘవికి చెప్పాడు. తాను బతకలేనని వెంటతెచ్చుకున్న క్రిమిసంహారక మందు తాగాడు. ఊహించని పరిణామంతో హతాశురాలైన సంఘవి నువ్వులేని జీవితం నాకొద్దని చెప్పింది. ఇద్దరం కలిసే చనిపోదామని శ్రీకాంత్ నుంచి క్రిమిసంహారక మందు లాక్కుని తాగింది.

క్షణికావేశంలో నిర్ణయం..తర్వాత బతకాలని తాపత్రయం..

క్షణికావేశంలో ప్రేమికులిద్దరూ చావాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ క్రిమిసంహారక మందు తాగారు. కానీ అంతలోనే తేరుకుని చావు సమస్య కు పరిష్కారం కాదని భావించారు. కష్టాలను కలి సే పంచుకుందామని సంఘవి శ్రీకాంత్‌కు చెప్పడంతో పొరపాటు చేశానని భావించాడు. వెంటనే బతుకుదామని తన ఆటోలోనే ఇద్దరూ మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులకు విషయం చెప్పారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ శ్రీకాంత్ ఈనెల 18న(శనివారం) రాత్రి 9 గంటల సమయంలో మృతిచెందాడు. ప్రియుడు చనిపోయిన రెండు గంటల తర్వాత సంఘవి కూడా మృతిచెందింది. సంఘవి తల్లి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హాజీపూర్ ఎస్సై తెలిపారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర



మంచిర్యాలలో శివాజీ శోభాయాత్ర..

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని మంచిర్యాల, చెన్నూర్ పట్టణాల్లో ఆదివారం సాయంత్రం శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మంచిర్యాలలో హిందూ వాహిని సమితి ఆధ్వర్యంలో శ్రీనివాస టాకీస్ సమీపం నుంచి పట్టణ పురవీధుల మీదుగా శోభాయాత్ర సాగింది. శివాజీ విగ్రహంతో చేపట్టిన ఊరేగింపులో పార్టీలకతీతంగా నాయకులు పాల్గొన్నారు. విద్యుత్ వెలుగుల్లో డీజే పాటలకు విద్యార్థులు నృత్యాలు చేశారు. హమాలీవాడ భక్తాంజనేయ షిరిడీ సాయి దేవాలయం వద్ద ఛత్రపతి శివాజీ శోభాయాత్రను మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. సీపతి మహేశ్, మారుతీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, కౌన్సిలర్లు రాజు, హరికృష్ణ, మాజీ కౌన్సిలర్ సీపతి శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యుడు తోట తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూదరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. చెన్నూర్ పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక జలాల్ పెట్రోల్ బంకు నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ తీశారు. వీరత్వానికి ప్రతీకగా కొలుచుకునే ఛత్రపతి శివాజీ చిత్రపటానికి హిందూ ఉత్సవ సమితి సభ్యులు నివాళులర్పించారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, ప్రతీ గ్రామంలో, పట్టణాల్లోని వార్డుల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బొలిశెట్టి హన్మంతుపటేల్ స్మారక జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. పాత మంచిర్యాలలోని మున్సిపల్ క్రీడా మైదానంలో పోటీలను ప్రారంభించారు. క్రీడాకారుల కోసం మున్సిపల్‌కు సంబంధించిన పది ఎకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ మైదానం అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి సునీత, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, క్లబ్ సెక్రటరీ ఎర్రం ప్రభాకర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, వార్డు కౌన్సిలర్లు సుదమల్ల హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పాస్ ఉన్నా.. టికెట్ కొనుడే!

బెల్లంపల్లికి చెందిన పద్మ మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తోంది. నిత్యం విధులకు బెల్లంపల్లి నుంచి వచ్చి వెళ్తోంది. రోజువారీగా నగదు చెల్లించకుండా ఆర్టీసీ నెలవారీ సీజనల్ పాస్ తీసుకుని ప్రయాణం చేస్తోంది. రోజువారీ చార్జీ నెలకు రూ.1,800 కాగా, సీజనల్ పాస్‌కు రాయితీతో రూ.1,230 చెల్లించింది. అయితే ఇటీవల మందమర్రి సమీపంలో ఓ టోల్‌గేట్ ప్రారంభించారు. దీంతో పాస్ ఉన్నా బస్సు ఎక్కిన ప్రతీసారి టోల్ చార్జి పేరుతో రూ.10 వసూలు చేస్తున్నారు. దీంతో పాస్ ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. రోజుకు రూ.20 చొప్పున నెలకు రూ.600 అదనంగా చెల్లించాల్సి వస్తోందని పద్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికులు

- రాయితీపాస్ ప్రయాణికులపై ఆర్టీసీ ‘టోల్’ బాదుడు
- అప్ అండ్ డౌన్‌కు రోజుకు రూ.20 వసూలు

మంచిర్యాల అర్బన్: ప్రైవేట్ వాహనాల తాకిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆర్టీసీ.. ప్రయాణికులను ఆకర్షించేందుకు మరిన్ని సౌకరాలు కల్పిస్తూ రాయితీలు అందిస్తోంది. ఇందులో భాగంగా నెలవారీ బస్సులో ప్రయాణం చేసేవారికి 30 రోజులకు 20 రోజుల చార్జీతో ప్రయాణించేలా సీజనల్ కార్డు అందిస్తోంది. తాండూర్‌వైపు నుంచి మంచిర్యాలకు ప్రయాణించేవారు 120 మంది సీజనల్ పాస్ తీసుకున్నారు. జిల్లా మొత్తంగా 339 మంది దివ్యాంగులు రాయితీ పాస్‌లు పొందారు. ఇటీవల మందమర్రి దాటిన తర్వాత ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌తో సమస్య మొదలైంది. ఉచిత బస్‌పాస్ మినహాయిస్తే దివ్యాంగులు, నెలవారీ సీజనల్ బస్‌పాస్ తీసుకున్న ప్రయాణికుల నుంచి బస్సు ఎక్కిన ప్రతీసారి టోల్ చార్జీ పేరుతో కండక్టర్లు రూ.10 టికెట్ ఇస్తున్నారు. అప్ అండ్ డౌన్ చేసేవారికి ఇలా రోజుకు రూ.20 తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇదేంటని అడిగితే యాజమాన్యం ఆదేశాల మేరకే చార్జీ వసూలు చేస్తున్నామని కండక్టర్లు చెబుతున్నారు. అదనంగా రూ.600 భారంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

ఆర్టీసీ బస్సులో ప్రయాణించేటప్పుడు ప్రతీ ప్రయాణికులు టోల్ చార్జీ చెల్లించకతప్పదు. ఒకవేళ నెలవారీ సీజనల్ పాస్‌లోనే టోల్ చార్జీలు కలిపితే పాస్‌లు జారీ చేసినా ప్రయాణం చేసేటప్పుడు టోల్ చార్జీ పడే అవకాశం ఉంది. రాయితీ పాస్ ప్రయాణికులపై అదనపు భారం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– రవీంద్రనాథ్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల

ప్రైవేట్ వాహనాల వైపు..

అధికారులు ఆర్టీసీ రాయితీలపై విస్తృత ప్రచారంతో ఆర్టీసీ వైపు మొగ్గుచూపిన ప్రయాణికులకు తాజాగా టోల్ చార్జీల వసూలుతో ప్రైవేట్ వాహనాల వైపు వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇంతకాలం చేతిలో చిల్లిగవ్వ లేకున్నా నెలవారీ సీజనల్, దివ్యాంగుల పాస్‌తో ప్రయాణం చేసిన వారు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల చార్జీలు సమానంగా ఉండడంతో బస్సుల కోసం వేచిచూడకుండా ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ వైపు వెళ్లే ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న టోల్‌గేట్ చార్జీలపై ఏదో నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన సెమీ ఫైనల్స్



పోటీలను తిలకిస్తున్న దృశ్యం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో జరుగుతున్న 41వ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో భాగంగా ఆదివారం సెమీఫైనల్స్ జరిగాయి. తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేసన్ చైర్మన్ శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను తిలకించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, సివిల్ ఈఈ గుండేరావు, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ ఆర్.నారాయణరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. బాలుర విభాగంలో కేరళ, మహారాష్ట్ర జట్లు తలపడ్డాయి. బెస్ట్ ఆఫ్ త్రీ మ్యాచ్‌లో మొదటి రెండు మ్యాచ్‌లు కేరళ జట్టు 10, 12 పాయింట్లతో విజయం సాధించింది. తరువాత తమిళనాడు, తెలంగాణ జట్లు తలపడ్డాయి. ఇందులో తమిళనాడు 15, 9 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. బాలురలో కేరళ, తమిళనాడు ఫైనల్‌కు చేరాయి. బాలికల సెమీఫైనల్స్‌లో మొదటి మ్యాచ్‌లో తమిళనాడు, రాజస్థాన్ తలపడగా 14, 31 పాయింట్ల తేడాతో తమిళనాడు విజయం సాధించింది. రెండో సెమీఫైనల్‌లో ఆంధ్రప్రదేశ్ కేరళ తలపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు 8, 4 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. బాలికల విభాగంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ఫైనల్‌కు చేరాయి. సోమవారం ఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

క్లుప్తంగా

ఎంవీ డ్రైవర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

- హెచ్ఎమ్మెస్ డిమాండ్

శ్రీరాంపూర్: సింగరేణిలో ఖాళీగా ఉన్న ఎంవీ డ్రైవర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ కార్యదర్శి టి.సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వి.అనిల్‌రెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. జాప్యంతో ఉన్న వారిపై పని భారం పడుతోందని పేర్కొన్నారు. 2021లో ఎంవీ డ్రైవర్, ఈపీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి కంపెనీ నోటిఫికేషన్ విడుదల చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించిందని, కానీ కేవలం ఈపీ ఆపరేటర్ పోస్టులను మాత్రమే భర్తీ చేసి ఎంవీ డ్రైవర్ పోస్టులకు మాత్రం ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా నిలుపుదల చేసిందన్నారు. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

చెరువులో పడి యువకుడి మృతి

లక్సెట్టిపేట: మోదెల గ్రామానికి చెందిన శశికుమార్ (26) చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. వివరాల ప్రకారం.. శశికుమార్ కొంతకాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. శనివారం మధ్యాహ్నం సమీపంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లగా ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా చెరువులో మృతదేహం కనిపించింది. తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మా భూములు మాకు ఇప్పించాలి

- 5వ రోజుకు బాధితుల నిరసన దీక్ష



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, పాల్గొన్న నాయకులు

నస్పూర్: పట్టణంలోని నస్పూర్ శివారులోని 42 సర్వే నంబరులో తమకు చెందిన భూములను ఇప్పించాలని కోరుతూ పలువురు రైతులు టీఎన్‌జీఓ కాలనీ వద్ద కుటుంబ సభ్యులతో చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం 5వ రోజుకు చేరుకుంది. వీరి దీక్షకు మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ, నస్పూర్ మాజీ సర్పంచ్ వేల్పుల రాజేశ్‌లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ మాదిగ మాట్లాడుతూ నస్పూర్‌కు చెందిన పలువురు దళిత రైతులకు చెందిన సుమారు 29ఎకరాల భూమిని పలువురు కబ్జాకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం ఓ రియల్టర్ ఇంటి నిర్మాణాలకు 12 బోర్లను ఏర్పాటు వేయించారని, స్టేటస్ కో ఉన్న భూమిలో బోర్లు ఎలా వేయిస్తారని ప్రశ్నించారు. గోపాల్‌రావు అనే రియల్టర్ మధ్యవర్తిత్వం పేరిట తమకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. ఇందులో కొయ్యల కొమురయ్య, సుర్మిల్ల శ్రీనివాస్, కొయ్యాల కిరణ్, రమేశ్ పాల్గొన్నారు.

ఆదివాసీల పోరుబాట

ఇటు అధికారులు.. అటు రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆందోళన బాట పట్టేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీ సంఘాలు సైతం ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు నేడు ఉట్నూర్ లోని ఐటీడీఏ కార్యాలయ ముట్టడికి రంగం సిద్ధం చేశారు. ఇందుకు గడిచిన వారం రోజుల నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీల గూడెల్లో ప్రచారం సైతం నిర్వహించారు. ఎక్కడికక్కడ ఆదివాసీలను జాగృతం చేసే కార్యక్రమాల్లో తుడుందెబ్బ, దాని అనుబంధ సంఘాల నాయకులు నిమగ్నమయ్యారు.



జైనూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

- ఆస్తిత్వం కోసం ఆందోళన
- అగ్గి రాజేసిన సీఎం వ్యాఖ్యలు
- హక్కుల కోసం ఉద్యమబాట
- 11కులాలను ఎస్టీల్లో కలపడంపై నిరసన
- నేడు ఐటీడీఏ ముట్టడికి పిలుపు

ఏజెన్సీలో ఆదివాసీలకు ఎంత రిజర్వేషన్?

ప్రభుత్వం పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. త్వరలో డీఎస్సీ కూడా వేయనుంది. కానీ ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంత వరకు రిజర్వేషన్ కల్పిస్తారనే మీమాంసంలో గిరిజన నిరుద్యోగ యువత ఉంది. ఏజెన్సీలోని ఉద్యోగాలు 100శాతం గిరిజనులకు వర్తించే విధంగా జీవో 3 ఇటీవల సుప్రీం కోర్టు సవరించింది. ఏజెన్సీలో 50శాతం వరకు గిరిజనులకు వర్తింపజేయాలని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మరో 15 తెగలను ఎస్టీలో చేర్చుతామనే ప్రకటనతో కేంద్ర ప్రభుత్వంపై నిరసనలు చల్లారకముందే రాష్ట్ర ప్రభుత్వం మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేయడంతో నిరసనలు రెట్టింపు అవుతున్నాయి.

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఇప్పటికే చాలా కోల్పోయామని.. ఇక కోల్పోవడానికి మా వద్ద ఏమి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం, ఉపాధి లేక వేలాది మంది నిరుద్యోగులు ఆదివాసీల్లో ఉన్నారని, ఎస్టీల్లో మరిన్ని కులాలను చేర్చితే తమ భవిష్యత్ ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

కనిపించని చట్టాల అమలు...

గిరిజన(ఏజెన్సీ) ప్రాంతాల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి నిరుపయోగమవుతున్నాయి. ఎక్కడ కూడా ఏజెన్సీ చట్టాల అమలు కానరావడం లేదు. ప్రత్యేక చట్టాలను రాజ్యాంగంలో పొందుపర్చినప్పటికీ ప్రభుత్వాలే వాటికి తూట్లు పొడుస్తున్నాయి. పెసా, 1/70 తదితర ప్రధాన చట్టాలు ఉన్నప్పటికీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోతున్నాయి. జీవో 317 తీసుకువచ్చి ఏజెన్సీల్లో గిరిజనేతరులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముఖ్యంగా ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలోని నిరుద్యోగులకు చాలా నష్టం వాటిల్లింది. భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ తెగల రక్షణకు ఆర్టికల్ 342కు సంబంధం లేకుండా గిరిజన ప్రాంతాల్లో అన్ని కార్యాలపాలు చకచకా సాగుతున్నాయి. 1/70 అమల్లో ఉన్నప్పటికీ ఆ చట్టం కేవలం కాగితాలకే పరిమితమైంది. ఏజెన్సీలోని అటవీ భూములు, స్థిరాస్తులు అన్నీ అన్యాక్రాంతమవుతున్నప్పటికీ అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. 1/70ను 2/70 గా మార్చే కుట్ర జరుగుతోందని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అనాదిగా సాగుచేస్తున్న అటవీ భూముల నుంచి ఆదివాసీలను ఎల్లగొట్టడానికి కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాలు వద్దు



ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోంది. ఇప్పటికే వలసవాదులతో అనేక విధాలుగా నష్టపోయిన ఆదివాసీలకు 11కులాలను కలుపుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం సరికాదు. ఆదివాసీల చట్టాలు, హక్కుల రక్షణ కోసం, ఆదివాసీల అస్తిత్వం కోసం పోరాటాలు చేయడానికి సిద్ధం. – బుర్స పోచయ్య, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు

మనుగడ కోసం పోరాటం చేస్తున్నాం..



ఇప్పటికే ఎస్టీ జాబితాలో లంబాడాలను కొనసాగించడంతో ఆదివాసీ లోకం విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ ఇతర అన్నీ రంగాల్లో తీవ్రంగా నష్టపోతోంది. అన్ని రంగాల్లో వారి పెత్తనంతో ఆదివాసీల అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడింది. మళ్లీ ప్రభుత్వం ఇతర కూలాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హేయమైన చర్య. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయం కోసం ఆదివాసీల మనుగడను ప్రమాదంలో నెట్టివేస్తోంది. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదు. – పుర్క బాపురావ్, ఆదివాసీ హక్కుల పొరాట సమితి తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆదివాసీల ప్రధాన డిమాండ్లు..

- ఎస్టీల్లో ఇతర కులాలను చేర్చవద్దు..
- చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి.
- గిరి వికాసం కింద ఆదివాసీలకు బోర్లను మంజూరు చేయాలి.
- ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి.
- జిల్లా, మండల కేంద్రాల్లో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి
- పెసా, 1/59, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.
- జీవో 3 యథాథిధిగా కొనసాగించాలి.
- 29శాఖాల్లో ఉన్న జీవోలను చట్టం చేసి 29 శాఖాల్లో ఉన్న ఉద్యోగాలను ఆదివాసీలతో నియమించాలి.
- గిరిజన యూనివర్సిటీ ఆదిలాబాద్ జిల్లాలోనే ఏర్పాటు చేయాలి.
- జీవో 317ను రద్దుచేయాలి.
- ప్రత్యేక డీఎస్సీతో ఆదివాసీలచే ఉపాధ్యాయ ఉద్యోగాలు నియమించాలి
- నాన్ ఏజెన్సీ ఆదివాసీ గ్రామాలకు ఏజెన్సీ గ్రామాలుగా మార్చాలి.
- దళితబంధు మాదిరిగానే ఆదివాసీబంధు ఇవ్వాలి.

'చిన్నయ్యను విమర్శిస్తే నాలుక చీరేస్తాం'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటుపడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై తప్పుడు విమర్శలు చేస్తే నాలుక చీరేస్తామని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి కాసర్ల యాదగిరి, గెల్లి రాజలింగు హెచ్చరించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే చిన్నయ్య చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీజేపీ నాయకుడు కొయ్యల ఏమాజీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆసిఫాబాద్‌కు చెందిన ఏమాజీ అక్కడ గిరిజనుల భూములను అమ్ముకుని ఆదివాసీలను దోచుకున్నారని విమర్శించారు. తప్పుడు విధానాలను అవలంబించడంతో ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏమాజీని బహిష్కరించారని, అక్కడ చెల్లని రూపాయి బెల్లంపల్లికి వచ్చి ఎమ్మెల్యే చిన్నయ్యను దుర్భాషలాడుతున్నాడన్నారు. బెల్లంపల్లిలో బీజేపీ నాయకులను తిరగనీయబోమని హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏమాజీ బీజేపీ పక్షాన పోటీ చేసి 1500 ఓట్లు తెచ్చుకున్నాడని, ఆయనను నియోజకవర్గ ఓటర్లు నమ్మడం లేదనడానికి ఆ ఓట్లే ప్రమాణికమని పేర్కొన్నారు. స్థాయిని మరిచి విమర్శలు చేయడం మానుకోవాలని, లేకపోతే తరిమితరిమి కొట్టాల్సి వస్తుందని అన్నారు. సమావేశంలో బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు గోసిక రమేష్, గద్దం అశోక్, దామెర శ్రీనివాస్, మాటూరి మధు, మాజీ కౌన్సిలర్ ఎలిగేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం



కుక్కల దాడిలో గాయపడిన సత్తవ్వ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ సమీపంలో కుక్కలు ఆదివారం సాయంత్రం స్వైరవిహారం చేశారు. పదకొండు మందిని తీవ్రంగా గాయపరిచాయి. వైద్యాధికారి శేఖర్ వివరాల ప్రకారం... ఆదివారం సంతలో ప్రజలపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. పట్టణానికి చెందిన సుశీల, శ్రీకాంత్, సత్తయ్య, సత్తవ్వ, రాజమ్మ, భూమయ్య, లక్ష్మణ్, పోచవ్వ, రాజమౌళి, యూసుఫ్, ఉమ గాయపడగా వారికి సివిల్ ఆసుపత్రిలో చికిత్స అందించి మంచిర్యాల ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- విగ్రహం ఏర్పాటులో యువకులు తీరు అభినందనీయం
- ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ

జన్నారం: యువకులు ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఆదివారం జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కవ్వాల్ గ్రామానికి చెందిన యువకులు ఐకమత్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో యువకులు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రధాని నరెంద్రమోదీ నాయకత్వంలో హిందుత్వం పెంపొందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ ఖాతాలో వేసుకుని ప్రధాని పేరు రాకుండా చూస్తుందన్నారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలు ఇంకా అభివృద్ధికి నోచడం లేదని ఆరోపించారు. మామిడిపెల్లి, కవ్వాల్ రోడ్డు నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అడవి అనుమతులు పొందేలా చొరవ తీసుకుంటానని తెలిపారు. అదే విధంగా కవ్వాల్ పోచమ్మ ఆలయం వరకు ఎంపీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కవ్వాల్‌కు నీరు అందించే విషయంపై ఉన్నత అధికారులతో, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెర్రబెల్లి, జెడ్పీటీసీ జానుబాయి, సర్పంచ్ లక్ష్మీ, బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, సర్పంచులు అశోక్‌రావు, గంగాధర్, ఎంపీటీసీ కొంతం శంకరయ్య, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జి హరినాయక్, మండల నాయకులు ఉట్కూరి శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రావు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వెడ్మ బొజ్జు ఉన్నారు.

'గుర్తింపు' ఎన్నికలు నిర్వహించాలి

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్
- ఐఎన్టీయూసీలో పలువురికి పదవులు



నియామక పత్రాలు అందిస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి ముగిసి రెండేళ్లు అవుతుందన్నారు. అయినా ఎన్నికలు నిర్వహించకుండా సింగరేణి జాప్యం చేస్తోందన్నారు. న్నికలు నిర్వహిస్తే సింగరేణిలో టీబీజీకేఎస్ ఓడిపోతుందనే భయంతో సర్కార్ ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. దీనిపై ఏఐటీయూసీ హైకోర్టును ఆశ్రయించగా 3నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలిచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలపై వారికి నిజంగా చిత్తశుద్ధి లేదన్నారు. అలాగే 10వ, 11వ వేజ్‌బోర్డులో ఐఎన్టీయూసీని లేకుండా మోదీ సర్కార్ అడ్డుకుందని, తాజాగా కోల్‌కత్తా హైకోర్టు దీనిపై ఐఎన్టీయూసీ ఈ 11వ వేజ్ బోర్డులో తీసుకోవాలని కోలిండియాను ఆదేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, నాయకులు గరిగే స్వామి, భీంరావు, సమ్ము రాజయ్య, తిరుపతి పాల్గొన్నారు.

కమిటీలో పలువురికి చోటు...

ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులుగా కలవేని శ్యాం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భీం రవి, సెంట్రల్ కోర్ కమిటీ సభ్యుడిగా శీలం చిన్నయ్య, శ్రీరాంపూర్ బ్రాంచీ కన్వీనర్‌గా ఆర్ కృష్ణమూర్తిలతోపాటు పలువురికి కమిటీలోకి తీసుకున్నారు.

'విద్యారణ్య'లో అ'పూర్వ' వేడుక



హాజరైన పూర్వ విద్యార్థులు

- 42 బ్యాచ్‌ల విద్యార్థులు రాక
- 3వేల మందికిపైగా పూర్వ విద్యార్థులు, ఆచార్యుల హాజరు
- వేడుకకు వేదికైన రాంపూర్ ఆవాస విద్యాలయం



1990 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వారంతా చిన్ననాటి స్నేహితులు.. కలిసి చదువుకున్నారు.. ఉన్నత చదువుల కోసం తలాదారి పట్టారు. అలా దూరమైన అలనాటి బాల్య మిత్రులు నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. అనాటి జ్ఞాపకాలను.. చిలిపి అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. వారి అంతులేని ఆనందానికి.. పట్టరాని సంతోషానికి వేదికగా నిలిచింది మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని రాంపూర్‌లోని చొక్కారాంనగర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం.

ఒకేచోటకు 42 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు..

రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో పదో తరగతి వరకు చదువుకున్న మొత్తం 42 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ మహాసమ్మేళనంతో ఒకచోట కలుసుకున్నారు. 1980 నుంచి 2022 విద్యా సంవత్సరాల్లో చదువుకున్న దాదాపు 3,000 వేల మందికి పైగా విద్యార్థులతో పాటు వారికి పాఠాలు బోధించిన ఆచార్యులు ఒకేచోట చేరి ముచ్చట్లలో మునిగిపోయారు. ఆవాస విద్యాలయం పరిసరాలు, మైదానం మొత్తం పూర్వ విద్యార్థులతో సందడిగా మారాయి. ఇందులో శ్రీసరస్వతీ విద్యాపీఠం క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షుడు మాధవరపు వినయ్‌ప్రకాశ్‌రావు, మంచిర్యాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ కె.విష్ణువర్ధన్‌రావు, పాఠశాల ప్రారంభ ప్రధానోపాధ్యాయుడు కోటంరాజు, పూర్వ విద్యార్థి పరిషత్ ప్రాంత అధ్యక్షుడు రెడ్డిగారి హరిస్మరణ్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షుడు గుండం అశోక్ పాల్గొన్నారు.

నాటి రోజులు గుర్తొచ్చాయి..




పాఠశాలలో అటూ ఇటూ తిరుగుతూ స్నేహితులతో గడిపిన రోజులు అన్నీ గుర్తుకు వచ్చాయి. వివిధ కారణాలతో దూరమైన తాము ఇప్పుడు ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉంది. తోటి విద్యార్థులతో పాటు ఆచార్యులను కలవడం ఆనందంగా ఉంది. ఈ తీపి గుర్తులు జ్ఞాపకాలుగా మిగిలిపోనున్నాయి. – డాక్టర్ చేతన్‌చౌహాన్, ఎం.డీ.జనరల్ ఫిజిషియన్, పూర్వ విద్యార్థి

పూర్వ విద్యార్థులుగా సేవ చేస్తాం..



పూర్వ విద్యార్థులుగా అందరినీ కలుసుకోవడంలో చాలా సంతోషంగా ఉంది. సమ్మేళనంలో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకోగా ఇప్పుడు మరెన్నో జ్ఞాపకాలను వెంట తీసుకుని వెళ్లేలా ఈ వేడుక తోడైంది. పాఠశాలలో నేర్పిన విద్యాబుద్ధులు, ఉన్నతంగా తీర్చిదిద్దాయి. – మల్రాజ్ రవీందర్, జిల్లా రిజిస్ట్రార్, హైదరాబాద్

విద్యార్థుల ఉన్నతి ఆనం దాన్ని ఇస్తుంది



పాఠశాలలో విద్యార్థులుగా చదువుకుని ఉన్నత స్థితిలో ఉన్న తమ శిష్యులను చూస్తూ ఉంటే ఆనందంగా ఉంది. విద్యార్థులుగా నాడు చదువుకున్న వారు ఇప్పుడు ఒకొక్కక్కరూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గురువులను ఆత్మీయంగా సత్కరించడం మరచిపోలేని అనుభూతి. – వెంకటరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

వైభవంగా సామూహిక వివాహాలు



వధూవరులు

- మూడుముళ్లతో ఏకమైన ఎనిమిది జంటలు
- మంగళసూత్రాలు అందజేసిన ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



వధూవరులతో జెడ్పీ చైర్‌పర్సన్ లక్ష్మి

ఆసిఫాబాద్/: సిర్పూర్(యూ) మండలం మహాగావ్ సురోజీ బాబా ఆశ్రమంలో ఆదివారం సామూహిక వివాహాలు వైభవంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే సామూహిక వివాహాల్లో భాగంగా సరోజి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎనిమిది పేద జంటలకు వివాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డోలు వాయిద్యాలు, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో సామూహిక వివాహాలు జరిపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి వారికి ఉచితంగా మట్టెలు, మంగళసూత్రాలు, నూతన వస్త్రాలతో పాటు వంట సామాన్లు అందజేశారు. సామూహిక వివాహాలు జరిపిస్తున్న సరోజి కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా సురోజి బాబా మఠాధిపతి మెస్రం కైలాస్ మహారాజ్ మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 500 వివాహాలు జరిపించామన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, కమిటీ అధ్యక్షులు కొటానక పాండురంగ్, మెస్రం భూపతి మహరాజ్, వినాయక్ మహరాజ్, కిషన్ మహరాజ్, తానుపటేల్, పెందూర్ రాషావు మహరాజ్, భీమ్‌రావు మహరాజ్, ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, కెరమెరి జెడ్పీటీసీ ధృపద బాయి, సర్పంచ్ ఆత్రం పద్మరాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు తొడసం ధర్మారావు, గోండ్వానా మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు సిడాం అర్జున్, ఏఎంసీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, సహకార సంఘం చైర్మన్ శివాజీ, ఆత్రం చొక్కారావు, మెస్రం భూపతి, మెస్రం అంబాజీ, సీతారాం పాల్గొన్నారు.